వీరు మారరు.. దోపిడీ ఆపరు

ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. పర్యావరణ చట్టాలకు తూట్లుపొడిచేస్తున్నారు. వేదావతి నది గర్భానికి శోకం మిగులుతోంది. పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. పగలంతా ట్రాక్టర్ల ద్వారా సరిహద్దు ప్రాంతాల్లో డంప్ చేసి.. చీకటి పడగానే బళ్లారి, బెంగళూరు, సండూరు, చెళ్లకెర తదితర ప్రాంతాలకు టిప్పర్లలో తరలిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.



చీకట్లో రాయదుర్గం మీదుగా బళ్లారి వెళుతున్న ఇసుక టిప్పర్



బాదనహాళ్ హగరి పరివాహక ప్రాంతంలో ఇసుక లోడింగ్

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- రాయదుర్గం నియోజకవర్గంలో బరి తెగిస్తున్న ఇసుక మాఫియా
- ప్రకృతి సంపద కొల్లగొడుతున్నా పట్టించుకోని అధికారులు

రాయదుర్గం: నాణ్యమైన ఇసుకకు రాయదుర్గం నియోజకవర్గం పేరుగాంచింది. గుమ్మఘట్ట, డీ హీరేహాళ్, రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని వేదావతి హగరి నదీపరివాహక ప్రాంతాల్లోని ఇసుకకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీన్నే ఇసుక మాఫియా ఆదాయ వనరుగా మార్చుకుంది. వంకలు, వాగులు ఇలా ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ ఇష్టారీతిన తవ్వేస్తోంది. గుమ్మఘట్ట, డీ హీరేహాళ్ మండలాల మీదుగా కర్ణాటక సరిహద్దులోకి రోజూ పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుక తరలిపోతోంది. అక్కడ టిప్పర్ ఇసుక రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. పది చక్రాల లారీ ఇసుక అయితే రూ.2 లక్షలకు పైగా విక్రయిస్తున్నట్టు సమాచారం. దీనికి తోడు సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే పలుమార్లు ఇసుక డంప్‌లను అధికారులు సీజ్ చేసి.. పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసినా అక్రమార్కులు ఆగడం లేదు.

అడ్డగోలుగా తవ్వకాలు..

డీ హీరేహాళ్ మండలం బాదనహాళ్, నాగలాపురం, తిమ్మలాపురం, గుమ్మఘట్ట మండలం గుమ్మఘట్ట, వేపులపర్తి క్రాస్, భూపసముద్రం, బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్, ఏళంజి, బండూరు, కొలగానహళ్లి, రాయదుర్గం మండలం జుంజురంపల్లి, గుండ్లపల్లి, వేపరాళ్ల, కణేకల్లు మండలం కళేకుర్తి, బిదురుకుంతం, మాల్యం తదితర ప్రాంతాల నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలుతోంది. ఉచితం మాటున అధికార టీడీపీ నాయకులు కొందరు దోపిడీ చేసేస్తున్నారు. అత్యవసరాలకు ఇసుక వాడుకోవాల్సింది పోయి తమ సొంత ఆస్తిలా సహజవనరును సరిహద్దులు దాటిస్తూ రూ.లక్షల్లో కూడగట్టుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే అంతు చూస్తామంటూ ఇసుక మాఫియా వారు బెదిరిస్తున్నట్లు సమాచారం.

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా

అవసరాలకు కాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. అనుమతుల్లేకుండా సరిహద్దు దాటిస్తే క్రిమినల్ చర్యలు చేపడతాం. పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారంతో సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత పటిష్టంచేసి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేస్తాం. రాత్రిళ్లు ప్రత్యేక టీమ్‌ల ద్వారా గస్తీ నిర్వహించేలా చర్యలు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, మైనింగ్ డీడీ, అనంతపురం

క్లుప్తంగా

బెంచీల ఏర్పాటు



సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసిన దృశ్యం

కూడేరు: ఎమ్మెల్సీ శివరామి రెడ్డి సతీమణి ఉమాదేవి జ్ఞాపకార్థం బుధవారం కూడేరులోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం, తహసీల్దార్ కార్యాలయం, కరుట్లపల్లిలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ జయచంద్రా నాయుడు తన సొంత ఖర్చులతో ఈ బెంచీలను ఏర్పాటు చేయించారు. భక్తులు, ప్రజలు కూర్చొనేందుకు వీలుగా ఈ బెంచీలను సమకూర్చినట్లు జయచంద్రా నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మాజీ బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శైలాద్రి యాదవ్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శివరావు, మాజీ ఎంపీటీసీ సంగప్ప, గోపాల్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబును అరెస్టు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: జర్నలిస్టుపై దాడిచేసిన సినీనటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలని కళ్యాణదుర్గంలోని జర్నలిస్టు సంఘాల నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి పట్టణ సీఐ యువరాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అందని పరిహారం

కుందుర్పి: చిరుత దాడుల్లో ఇటీవల మృతి చెందిన పశువులకు సంబంధించిన పరిహారం తమకు ఇంకా అందించలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కెంచంపల్లిలో 6, కలిగొలిమిలో4, బెస్తరపల్లిలో 3, కుందుర్పిలో 4, జంబుగుంపల్లో 3, కొలిమిపాళ్యంలో 2 మూగజీవాలను చిరుతలు పొట్టన పెట్టుకున్నాయి. కాగా మృతి చెందిన పశువులకు పరిహారం కోసం అటవీశాఖ అధికారులకు నిబంధనలమేరకు దరఖాస్తు చేసుకున్నా పరిహారం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధిత రైతులు ఈరన్న, రామాంజి, కృష్ణమూర్తి, నాగప్ప, ఓబుళేసు తదితరులు వాపోయారు. జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పరిహారం అందించాలన్నారు.

రథం నిర్మాణానికి విరాళం



నగదును అందిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల పరిధిలోని బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి ఆలయంలో నూతన రథాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే అప్పిలేపల్లికి చెందిన వడ్డె శ్రీనివాసులు దంపతులు రూ.3.45 లక్షలను ఆలయ కమిటీకి విరాళంగా బుధవారం అందజేశారు.

ముగిసిన చన్నమల్లప్ప జాతర



అశ్వంపై స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: సూగేపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న చన్నమల్లప్ప స్వామి జాతర ముగిసింది. బుధవారం ఉదయం చన్నమల్లప్ప స్వామి మఠం శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11వ మఠాధిపతి అయిన చన్నమల్లప్పస్వామిని అశ్వంపై కూర్చోబెట్టి గ్రామోత్సం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

శెట్టూరు: జై భీమ్ ఏపీఎస్ఆర్టీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మార్క్ ఆస్పత్రి వైద్యులు దాదాపు వంద మందికి పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కోసం 10 మందిని రెఫర్ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం





ఉరవకొండ, బెళుగుప్పలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు రాకెట్ల అశోక్, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలలల్లో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించి కూటమి ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కుడా చంద్రబాబు నేరవేర్చలేదన్నారు. గత ఐదేళ్లలో వ్యవసాయాన్ని పండుగ చేస్తూ.. రైతులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మాజీ కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, మండల సమన్వయకర్త మూలగిరపల్లి ఓబన్న, మైనార్టీ నాయకులు బళ్లారి అసిఫ్, వడ్డే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: జిల్లా కేంద్రంలో ఈనెల 13న నిర్వహించే 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, పార్టీ జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్ పూల ప్రసాద్, ఎస్సీసెల్ విభాగం నాయకులు తిప్పేస్వామినాయక్, నాయకులు పాతన్న, తిప్పేస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: ఈనెల 13న అనంతపురం జిల్లా కేంద్రంలో తలపెట్టిన ర్యాలీకి రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి, సర్పంచులు మల్లెల జగదీష్, కొర్రాశివాజీనాయక్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముస్టూరు రెడ్డి, సీనియర్ నాయకులు రఘుపతి, భజన శంకర్, కిష్టప్ప, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు రైతు ద్రోహి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మెట్టు విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఆరు నెలలైనా హామీల అమలు లేదు
- అన్నదాతకు అండగా 13న వైఎస్సార్‌సీపీ ర్యాలీ

రాయదుర్గం: ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు ద్రోహి అని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి ధ్వజమెత్తారు. రాయదుర్గంలోని తన నివాసంలో బుధవారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలసి 'అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ' అనే పోస్టర్లను విడుదల చేశారు. మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని కూటమి సర్కారును నిలదీశారు. బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు పెట్టాల్సి ఉండగా దాని ఊసే ఎత్తలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా ద్వారా రూ.13,500 పెట్టుబడి సాయం అందించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రైతుకు నమ్మక ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఆయకట్టులో వరి ధాన్యం మొత్తం దళారులు ఎత్తుకెళ్లాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, దీని వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనమేమీ లేదన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర కూడా కరువైందన్నారు. ఉచిత పంటల బీమా రద్దు చేసి రైతుపై మరింత భారం మోపిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13న రైతు సమస్యల పరిష్కారం కోసం అనంతపురంలో చేపట్టిన భారీ ర్యాలీని విజయవంతం చేయాలని రైతులు, పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, శారద, శ్రీలక్ష్మి, కో–ఆప్షన్ కడ్డీపుడి నజీర్, నాయకులు పొరాళ్ల శివా, గొడిశెలపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి, సందీప్‌పాటిల్, చిత్రయ్య, అంజిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జులు బషీర్, నిజామ్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బొమ్మనహాళ్: రైతు సమస్యలపై ఈ నెల 13న కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీ, వినతిపత్రం సమర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, యువ నాయకుడు బడిగే వన్నూరుస్వామి పిలుపునిచ్చారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలిరావాలన్నారు.

నేడు తలారి రంగయ్య పర్యటన

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యతో పాటు రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులు గురువారం కుందుర్పిలో పర్యటించనున్నారని ఎంపీపీ కమలమ్మ, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక గుడికల్లు అల్లీపీరా ఆశ్రమం దగ్గరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు.

'ఆశా కార్యకర్తను వేధించలేదు'

ఉరవకొండ: పట్టణంలోని 5వ నంబర్ సచివాలయం పరిధిలో ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న శర్మాస్‌బీని తాను ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని ఎంఎల్‌హెచ్‌పీ సులోచన తెలిపారు. బుధవారం ఆమె ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. చెయ్యి చేసుకున్నట్లు శర్మాస్‌బీ అసత్య ఆరోపణలు చేసిందన్నారు. ఓ ఏఎన్‌ఎం చెప్పిన విధంగా ఆత్మహత్యయత్నం చేసుకుని.. తనపై ఆశా కార్యకర్త ఆరోపణలు చేసిందని తెలిపారు. గత రెండేళ్లుగా ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను వైద్య సేవలు అందిస్తున్నానని పేర్కొన్నారు. తనను మానసికంగా ఇబ్బంది పెట్టడానికే ఇదంతా చేసిందని ఆరోపించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న అధ్యాపకుడు గోపాల్ నాయక్

ఉరవకొండ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ముఖ్యంగా విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్రం సీనియర్ అధ్యాపకుడు గోపాల్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాల్యా వివాహాలు, సామాజిక దురాచారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యాపకుడు గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాల వయస్సు నిండకుండా ఎట్టి పరిస్థితుల్లో అమ్మాయిలకు వివాహం చేయరాదన్నారు. బాలికలకు జీవితంలో మంచి భవిష్యత్తు ఇచ్చేది విద్య మాత్రమే అన్నారు. బాల్యా వివాహల రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ వెంకటరాముడు, పరమేష్‌లు పాల్గొన్నారు.

నాగేంద్రను పరామర్శించిన డీఎస్పీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగేంద్రను బుధవారం డీఎస్పీ రవిబాబు పరామర్శించారు. మంగళవారం కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చాకలి తిప్పేస్వామి తన బంధువులతో కలసి నాగేంద్రపై దాడి చేశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగేంద్రను పరామర్శించి న్యాయం జరిగేలా చూస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్లను నివారించుకోండి

వజ్రకరూరు: మండలంలోని గడేహోతురు గ్రామంలో బుధవారం కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ పర్యటించారు. మిరపలో తెగుళ్లు, పురుగుల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త యుగంధర్ మాట్లాడుతూ.. నల్లతామర పురుగు నివారణకు పసుపురంగు, నీలంరంగు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సూక్ష్మపోషకాల మిశ్రమం ఐదు గ్రాములను లీటరు నీటితో కలిపి ఐదు రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని సూచించారు. పంట చుట్టూ సరిహద్దులో బంతిపూల మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య, ఆయిల్‌పామ్ కంపెనీ ఏరియా మేనేజర్ సుమంత్‌రెడ్డి, ఆత్మా బీటీఎం కిన్నెర తదితరులు పాల్గొన్నారు.

క్వారీకి ఎలా అనుమతులిచ్చారు?

శెట్టూరు: ఐదుకల్లు గ్రామంలో క్వారీ అనుమతులపై మహిళా రైతులు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని నిలదీశారు. గ్రామంలోని సర్వే నంబర్ 185లో 1.070 హెక్టార్లలలో క్వారీ నిర్వహణ వల్ల చుట్టు పక్కల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. క్వారీ నిర్వహించడంతో బోరు బావులు ఎండిపోతున్నాయని, పొలంలోకి రాళ్లు, మట్టి వచ్చి పడటంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీకి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. అయితే క్వారీ నిర్వహణకు తాను అనుమతులు ఇవ్వలేదని, ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. అయితే తప్పుడు అనుమతులు, రిపోర్టులతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి క్వారీకి అనుమతులు ఇచ్చారని రైతులు ఆరోపించారు. వెంటనే పనులు ఆపించాలని డిమాండ్ చేశారు.

భూఆక్రమణలపై చర్యలు తీసుకోండి

చిన్నంపల్లిలో సచివాలయం పక్కనే ఉన్న 1.50 ఎకరాల గ్రామ కంఠం భూమి ఆక్రమణ గుర్చైందని, వెంటనే చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వైఎస్సార్‌సీపీ తాలుకా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు గిరిబాబు బుధవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టితో వాగ్వాదానికి దిగిన రైతులు

బెళుగుప్ప: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షర్మిల సూచించారు. బుధవారం స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ పెద్దన్న, వివిధ శాఖల అధికారులతో కలసి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బెళుగుప్ప గ్రామ పరిధిలో భూ సమస్యలపై 12 వినతులు అందాయి.

అమ్మాయి చదువు అవనికి వెలుగు

గుమ్మఘట్ట: అమ్మాయి చదువు అవనికి వెలుగని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి తెలిపారు. బీటీపీ గ్రామంలోని కేజీబీవీలో ఐసీడీఎస్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ, రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ అమ్మాయిలకు చిన్నవయసులోనే వివాహాలు చేస్తే మానసిక, శారీరక ఒత్తిడికి గురవడమే కాక ప్రసవ సమయంలో తల్లీబిడ్డల ప్రాణాలకు అపాయం కలుగుతుందన్నారు. అమ్మాయికి పద్దెనిమిదేళ్లు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ షబానాబేగం, పీహెచ్‌సీ వైద్యులు రమేష్, సందేశ్‌కుమార్, ఆరోగ్య బోధకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయినులు రత్నమ్మ, హిమబిందు, లక్ష్మీ, కళ్యాణి, హసీనాబాను, రాధమ్మ, ఆర్డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న కడపలో జాతీయ ఐక్యతా సదస్సు

రాయదుర్గంటౌన్: జమియతే ఉలమా–ఏ–హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 15న కడపలో 'రాజ్యాంగ పరిరక్షణ – జాతీయ ఐక్యతా సదస్సు' నిర్వహించనున్నట్లు పులివెందులకు చెందిన ముఫ్తీ కలీముల్లా తెలిపారు. బుధవారం రాయదుర్గంలోని జామియా చౌక్ మసీదులో 'రాజ్యాంగ పరిరక్షణ – జాతీయ ఐక్యతా సదస్సు' పోస్టర్లను స్థానిక మౌల్వీలతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలీముల్లా మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య అతిథిగా జమియతె ఉలమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదనీ హాజరవుతారని తెలిపారు. రాజ్యాంగం ప్రాముఖ్యత, జాతీయ ఐక్యతపై చర్చిస్తారని వివరించారు. కార్యక్రమానికి ముస్లింలు, మేధావులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహమ్మద్ అక్రమ్, మహమ్మద్ నజీర్, మసీదు ఇమామ్‌సాబ్‌లు ముఫ్తి నూర్ మొహమ్మద్, జుబేర్, ఉస్మాన్, మహబూబ్ బాషా, ఉమర్, ముబాషిర్, ఖలీల్, మహమ్మద్ రఫీక్, హమది పాల్గొన్నారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండల కేంద్రంలోని మూర్తి మీ–సేవా కేంద్రం వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పారేది. సాక్షి దినపత్రికలో ఈనెల 7న 'పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా' అనే శీర్షికనతో కథనం వెలువడింది. పంచాయతీ అధికారులు బుధవారం స్పందించారు. తాగునీటి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించారు. తాగునీరు వృథాకు అడ్డుకట్ట వేశారు.

గత అర్జీల సంగతేంటి?

బొమ్మనహాళ్/ రాయదుర్గం టౌన్/ గుమ్మఘట్ట: రెవెన్యూ సమస్యలపై గతంలో ఇచ్చిన అర్జీల సంగతేంటని బాధితులు అధికారులను నిలదీశారు. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మునివేలు అర్జీలు స్వీకరించారు. గ్రామంలోని మదీస్ వీధి నుంచి గౌరమ్మ దేవాలయం వరకు ఉండే రోడ్డు ఇరువైపులా ఆక్రమణకు గురైందని రెండేళ్ల క్రితం అర్జీలు ఇస్తే.. ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు హీరోజీరావు, సికిందర్ తదితరులు నిలదీశారు. రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఇక గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి సదస్సులో ఐదు వినతులు అందాయి.

సమస్యలను సత్వరం పరిష్కరించండి



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కుందుర్పి: రెవెన్యూ సదస్సుల్లో రైతులను నుంచి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు కుందుర్పి తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని బసాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

సంక్షిప్త సమాచారం

ఎస్‌ఏ–1 పరీక్షలు ప్రారంభం

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో బుధవారం సెల్ఫ్ ఎసెస్‌మెంట్ టర్మ్–1 (సమ్మేటివ్) పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. రాయదుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో మొత్తం 285 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే 48,198 మంది విద్యార్థులు తెలుగు, ఉర్దూ పరీక్షలు రాశారు.

15లోగా ప్రీమియం చెల్లించాలి

రాయదుర్గంటౌన్: వాతావరణ ఆధారిత బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియాన్ని ఈ నెల 15లోగా చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని రైతు సేవ కేంద్రం, పట్టణ శివారులోని పైతోటలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ, వరి పంటలకు ఆశించే చీడపీడల నివారణ చర్యలు ఏడీఏ వివరించారు. ఏఓ మహేంద్ర, విస్తరణ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



కార్మికులకు పనిముట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. బుధవారం పాత మున్సిపల్ కార్యాలయంలో 106 మంది పారిశుధ్య కార్మికులకు పారలు, చీపుర్లు, కొడవళ్లు, కాలవ పార తదితర పనిముట్లను చైర్‌పర్సన్‌తోపాటు కౌన్సిలర్లు పంపిణీ చేశారు. ప్రజలు చెత్తను కాల్వల్లో పారవేయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేసి 'స్వచ్ఛ రాయదుర్గం' కోసం సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, శ్రీలక్ష్మి, పొరాళ్ల గోవిందరాజులు, కో ఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మేస్త్రీలు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

కూడేరు: పంట మార్పిడి చేస్తే భూమి సారంతంగా మారి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. బుధవారం మరుట్లలో వ్యవసాయం దాని అనుబంధ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎప్పుడూ వేరుశనగ పంట సాగే కాకుండా ఇతర పంటల సాగుకు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, పట్టు పరిశ్రమ శాఖ టీఏ శ్రీనివాసులు, వీఏఏ నారాయణమ్మ, వీహెచ్‌ఏ శారద తదితరులు పాల్గొన్నారు.

వేతనాలివ్వకపోతే ఎలా బతకాలి?

రాయదుర్గంటౌన్: నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి అంటూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు (స్కావెంజర్స్) ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిపడ్డ తొమ్మిది నెలల వేతనాల కోసం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో వారు బుధవారం ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం ఎంఈఓ నాగమణికి వినతిపత్రం అందజేశారు.

సాగునీటి ఎన్నికలకు సహకరించాలి

బొమ్మనహాళ్: ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ కోరారు. బుధవారం బొమ్మనహాళ్‌లోని వెలుగు కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన పీఓలు, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ దాస్, ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, బేలోడు, భూపసముద్రం, పూలకుంట, రంగసముద్రం, గుమ్మఘట్ట సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.